క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్తమైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటిరోజు గ్రామంలో భక్తులతో కలిసి విగ్రహాల ఊరేగింపు పెద్దఎత్తున నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు ఇళ్ల నుంచి బిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో మూడురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నా యని ఆలయ కమిటీ నిర్వాహకుడు గుంటం నర్సింహారెడ్డి తెలిపారు. భక్తులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ముద్దెంగూడ మాజీ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏర్రోనిగూడ గ్రామంలో ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఉపసర్పంచ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు దేవాలయం వద్దకు బారులు తీరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతకు నైవేద్యాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మహాలింగాపురం పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

శంకర్‌పల్లి: మండలంలోని మహాలింగాపురం, కొత్తపల్లి గ్రామాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే ఎంతో మంది విద్యార్థులకు సాయం చేశామని, భవిష్యత్‌లో ఇంకా విద్యార్థులకు సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సభ్యులు కుబ్లాయి, అనుపమ, పద్మజ, పెంటయ్య, శ్రీరాములు, మాణిక్యరావు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నందిగామలో పరీక్ష ప్యాడ్ల అందజేత



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్

నందిగామ: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నర్సింహా, సురేశ్, మాజీ ఉపసర్పంచ్ కుమార్, ఈశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన సదస్సు

మంచాల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. సోమవారం మండల పరిధి లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు విడతల వారీగా అందజేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై నజర్

- ఇప్పటివరకు 56 శాతం వసూలు
- లక్ష్యాన్ని అధిగమించేందుకు శ్రమిస్తున్న కార్యదర్శులు
- మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి



మండల పరిషత్ కార్యాలయం

కొత్తూరు: ఆర్థిక, ఆదాయ వనరులు ఉంటేనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు చేసేందుకు వీలుంటుంది. కొన్ని గ్రామ పంచాయతీలకు స్వతాహాగా ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు అవకాశం లేదు. దీంతో ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులపైనే ఆధారపడి పాలన సాగిస్తున్నాయి. దానికితోడు ఇతర పథకాల నుంచి వచ్చే నిధులు క్రమంగా తగ్గిపోవడంతో పంచాయతీలు అభివృద్ధి, సిబ్బంది వేతనాల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో కార్యదర్శులు సిబ్బందితో కలిసి పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

12 జీపీల్లో..

మండలంలో ప్రస్తుతం 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా ఈ ఏడాది పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.98లక్షల 78వేల 533లు ఉండగా ఇప్పటివరకు రూ.55లక్షలు వసూలు చేశారు. ఇప్పటి వరకు 56 శాతం మాత్రమే వసూలు అయ్యింది.

సర్వేలతో ఆలస్యం

గ్రామ పంచాయతీల పాలనలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల గుర్తింపు పనుల్లో మగ్నమయ్యారు. వరుసగా ప్రభుత్వం కార్యదర్శులకు అదనపు పనిభారం ఇస్తుండడంతో పన్నుల వసూళ్లపై ప్రభావం చూపుతోంది. దీంతో ఇప్పటికే 85 శాతానికి పైగా పన్నులు వసూలు కావాల్సి ఉండగా.. 56 శాతానికే పరిమితమైంది. మండలంలో అత్యధికంగా మల్లాపూర్‌తండా, పెంజర్ల గ్రామాల్లో పన్నుల వసూలు 76 శాతానికి దాటగా, అత్యల్పంగా ఎస్‌బీపల్లిలో 20శాతం, కొడిచర్లలో 26శాతం మాత్రమే వసూలు చేశారు.

ప్రత్యేక డ్రైవ్

మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో వందశాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నోటీసులు జారీ చేస్తున్నారు.

పంచాయతీ వారీగా పన్నుల వసూలు

పంచాయతీ	లక్ష్యం	వసూలు చేసింది	శాతం
గూడూరు	3,96,850	1,40,423	35
ఇన్ముల్‌నర్వ	20,25,478	6,98,897	35
కొడిచర్ల	2,39,025	56,413	24
కొడిచర్లతాండ	2,13,408	1,14,763	54
మక్తగూడ	2,68,787	1,47,780	55
మల్లాపూర్	2,67,657	1,69,976	64
మల్లాపూర్‌తండా	98,056	74,475	76
పెంజర్ల	39,65,026	28,85,929	73
ఎస్‌బీపల్లి	3,01385	60,966	20
సిద్ధాపూర్	5,41,216	1,92,511	36
తీగాపూర్	14,36,529	8,96,480	62
వైఎంతండా	1,25,116	63,266	51

లక్ష్యాన్ని చేరుకుంటాం



మండలంలో వందశాతం పన్నులు వసూలు చేసే విధంగా కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తాం. ఇప్పటికే మండలంలోని 12 పంచాయ తీల్లో 56 శాతం పన్నులు వసూలు చేశాం. వరుసగా సర్వే లు, ఇతర కార్యక్రమాలు ఉండడంతో కొంత ఆలస్యం జరుగుతోంది. మార్చి వరకు లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేస్తాం.

– విజయలక్ష్మి, ఎంపీఓ, కొత్తూరు



మొయినాబాద్‌రూరల్: ఇరుముళ్లతో శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

మార్మోగిన శివనామస్మరణ

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చాకలిగూడ గ్రామంలో దాదాపు 15 మంది శివమాల ధరించిన భక్తులు ఇరుముళ్లతో శ్రీశైలం బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలో గల శివాలయంలో ఇరుముళ్ల మహాపడి పూజను భక్తులు వైభవంగా నిర్వహించారు. దీంతో గ్రామ వీధులు శివనామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో నాయకులు రెడ్డిమోని యాదయ్య పాల్గొన్నారు.

వీరన్నకు ప్రత్యేక పూజలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సోమవారం గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో శివస్వాములు వీరన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శివ మండల దీక్షల సమయంలో గ్రామదేవతలకు పూజలు నిర్వహించి శ్రీశైలం వెళ్తారన్నారు. శివభక్తులు నియమనిష్ఠలతో దీక్షలు పూర్తిచేస్తే మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శివస్వాములు నర్సింలు, బుగ్గయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపొందడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో వివిధ గ్రా మాల నాయకులు, కార్యకర్తలు వెంకట్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు



ధ్వజస్తంభ పునప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

దైవచింతన అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో జరుగుతున్న నాబి శిల, ధ్వజస్తంభ, పోతురాజు విగ్రహాల పునప్రతిష్ఠ మహోత్సవ పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పూజలతో గ్రామం భక్తిభావంతో నిండిపోయింది.ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి స్వగ్రామమైన కౌకుంట్లలో జరుగుతున్న ఈ పూజల్లో ఆమె తనయుడు పి.కార్తీక్‌రెడ్డి దంపతులు, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులో ప్రజాపాలన సేవా కేంద్రం

- ఎంపీడీఓ హిమబిందు



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రం

చేవెళ్ల: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొననివారి వివరాలు నమోదు చేసుకునేందుకు మండల కేంద్రంలో ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో వివరాలు ఇవ్వనివారి కోసం ప్రభుత్వం ఈ నెల 28వ తేదీవరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా సర్వేలో పాల్గొననివారు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో దాదాపు 17,400లకు పైగా కుటుంబాలకు సర్వే జరిగిందన్నారు. అప్పుడు మండలంలో మొత్తం 36 ఇళ్లు మాత్రమే డోర్‌లాక్ అని వచ్చిందని చెప్పారు. వారితో పాటు ఇంకా ఎవరైనా మిగిలిపోయి సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారు ఉన్నా ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

వైభవంగా శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



సహస్ర పుష్పార్చన నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో రెండోరోజు సోమవారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యే క పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం పునఃపూజ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, మంగళహారతి, అన్నదానం భజన కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పార్చన, రుద్ర హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు చైర్మన్ సున్నపు వసంతం, మాణిక్యప్రభులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.



కొందుర్గులో..



మొయినాబాద్‌రూరల్: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి



మొయినాబాద్‌రూరల్: అనాథ ఆశ్రమంలో పండ్లు అందిస్తున్న జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి



షాద్‌నగర్‌రూరల్: కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు

తెలంగాణ సాధకుడు కేసీఆర్

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పలు గ్రామాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాలు, పీహెచ్‌సీల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన మహానేత కేసీఆర్ అని, ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికలతో పాటు రాష్ట్రంలో ఏలేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.



శంకర్‌పల్లి: పీహెచ్‌సీ వద్ద రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



చేవెళ్లలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు



షాబాద్: ముద్దెంగూడలో..

నూతన కమిటీ నియామకం

మంచాల: మండల పరిధి తాళ్లపల్లిగూడ శ్రీభవాని రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా డాక్టర్ ఎస్.కె.భిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం దేవాదయశాఖ ఈఓ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో చైర్మన్‌గా భిక్షపతి, సభ్యులుగా హరికిషన్, ఐలయ్య, యాదయ్య, అనితను నియమించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. కమిటీ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని వైద్యాధికారిపరిక్షిత్ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఆపరేషన్ల నిమిత్తం 21 మందిని మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: వేసవికాలంలో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరా ఎలా ఉంది? ఎక్కడైనా సమస్య ఉందా, పెండింగ్ పనులు ఉన్నాయా, నిధులు అవసరమున్నాయా తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఏ గ్రామంలోనైనా సమస్యలు ఉంటే అధికారులు వెంటనే స్పందించాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి పైప్‌లైన్ మరమ్మతు, మరేదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. సమావేశంలో భగీరథ డీఈలు మోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఏఈలు శరత్, వాగ్దేవి, ప్రణీత్, శ్రావ్య, కేతన్, శ్రీనివాస్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తవద్దు

కడ్తాల్: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి రావిచేడ్ గ్రామ పంచాయతీ పరిధి మద్దెలకుంటతండాలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు, నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. తండాలో కరెంట్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నరేందర్, డీసీసీ అధికార ప్రతినిధి విఠలయ్యగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, యాదయ్య, సుమన్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు: అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి